# గర్భస్రావం

రచయిత రచనని విమర్శకుడు విమర్శించాడు; బాగుండ లేదని.

"రచనలు చెయ్యడం చేతగానివాళ్ళందరూ విమర్శకు లయ్యారు" అన్నాడు రచయిత విమర్శకుడితో.

విమర్శకుడు మాట్లాడలేదు.

రచయితా విమర్శకుడూ మిత్రులే చాలకాలంనుంచి.

"రచన బాగుండలేదంటే ఏమైనట్లు? అలాగేనా విమర్శించవలసింది?" అన్నాడు విమర్శకుడు. అని, "ఐనా నాలో, నా రచనల్లో ఆ ఛాయలున్నాయి - యీ ఛాయ లున్నాయన్నావు నువ్వు. ఛాయలు మనుషుల్లోనూ, రచనల్లోనూ వుండవు. సూర్యుడో, చంద్రుడో, దీపమో వుంటే ఛాయలు పడతాయి గాని, వూరికే పడవు. విమర్శకుడికా మాత్రం గూడా తెలియకపోతే యెట్లా?" అనడిగాడు కవ్వించుతూ విమర్శకుణ్ణి.

విమర్శకుడు మాట్లాడలేదు.

"నా రచన చదివి వినిపిస్తే నా భార్య భోరుమంది, ఇరుగు పొరుగంతా హోరుమంది" అని, ఆగి చూశాడు రచయిత, విమర్శకుడిప్పుడైనా ఆశ్వాసన ఇవ్వకపోతాడా అన్నట్లు.

విమర్శకుడు మాట్లాడలేదు.

"ఇదిగో, యిటు చూడు నేస్తం! రచన చెయ్యడం అంటే మాటలు గాదు; బిడ్డను కనడంలాంటిది. బిడ్డను కనేందుకు ఎంత కష్టపడాలో నీకు తెలియుంది కాదు" అన్నాడు అర్థించుతూన్నట్లు.

"నిజమే నాయనా! కాని యేం చెయ్యను? నువ్వు కన్నది మృత శిశువుని. చచ్చిపోయి గర్భం బయటబడ్డ బిడ్డని. చూచి "ఆహా! యెంత బావుంది!! అని యెట్లా అనను?" అన్నాడు విమర్శకుడు.

రచయిత మరి మాట్లాడలేదు.

—:o:—